

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 32 | శుక్రవారం 8, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# ‘ఆపరేషన్ సిందూర్’

## ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం పంపింది

- ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తి
- భారత్‌పై దాడి చేస్తే సహించబోమని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- సాయుధ దళాల ధైర్యసాహసాలను కొనియాడిన గవర్నర్, మంత్రులు
- పహల్గామ్ దాడి మృతులకు నివాళులు అర్పించిన నేతలు
- ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన లోకేశ్, బండి సంజయ్



2లో

ఆంధ్రప్రదేశ్, మే 7 : ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మన గడ్డపై దాడులను దేశం సహించబోదని, మన పౌరులకు ఎలాంటి హాని జరిగినా చూస్తూ ఊరుకోబోమని ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపిందని ఆయన అన్నారు. గురువారం (మే 7) ఆపరేషన్ సిందూర్ తొలి వార్షికోత్సవం సందర్భంగా ‘ఎక్స్’ వేదికగా చంద్రబాబు



### ప్రజలు ఎన్నుకొన్న టీవీకేని

# అడ్డుకోవడం నేరం

♦ కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్

చెన్నై, మే 7: తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న ‘తమిళగ వెట్రి కజగం’ (TVK) అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ANI వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు.

గవర్నర్ వెంటనే TVKని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. ‘తమిళనాడులో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని మనందరికీ తెలుసు.. ప్రజలు ఒక కొత్త నాయకుడి కోసం ఓటు వేశారు. ఆ పార్టీ నుంచి 108 మంది సభ్యులు ఎన్నికయ్యారు’. అని ఠాగూర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతో TVK బలం 113కు చేరిందని, 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మెజారిటీ మార్కుకు కేవలం కొన్ని సీట్ల దూరంలోనే ఉందని ఆయన గుర్తుచేశారు. ‘గవర్నర్ బీజేపీకి చెందిన వ్యక్తి.. ఆయన గతంలో బీజేపీలో పనిచేశారు. ఆయనకు బీజేపీ మనస్తత్వం ఉందని

▶▶| మిగతా 2వ పేజీలో..

# నెలకు నాలుగు ఘన కార్యాలు

### -సంక్షేమం నుంచి సెమీ కండక్టర్ల దాకా 23 నెలల్లో 100 విజయాలు

### - బి ఆకేపాటి శివశంకర్ రెడ్డి





**ఈ 23 నెలల పాలనను కూటమి ప్రభుత్వం కేవలం పరిపాలనగా కాకుండా “పునర్నిర్మాణ యుగం”గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా గత ఐదేళ్లలో ఆగిపోయిన వ్యవస్థలను మళ్లీ గాడిలో పెట్టామని, కేంద్రంతో సంబంధాలను మెరుగుపరచి పెట్టుబడులను ఆకర్షించామని, రాష్ట్రానికి తిరిగి విశ్వాసాన్ని తీసుకొచ్చామని అధికార వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ఇక్కడ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. 23 నెలల తర్వాత కూటమి ప్రభుత్వం ఇప్పుడు “రక్షణాత్మక స్థితి” నుంచి “దాడి రాజకీయాల” దిశగా అడుగులు వేస్తోంది. ఈ 100 విజయాల కథనం... రాబోయే రాజకీయ యుద్ధానికి ట్రైలర్‌లా మారుతోంది.**

ఏపీ బ్యూరో (ప్రజాసీమ) : “హామీలు అమలు చేశామా? రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించామా?” అనే ప్రశ్నకు సమాధానంగా కూటమి ప్రభుత్వం ఇప్పుడు “23 నెలలు -- 100 విజయాలు” అనే భారీ రాజకీయ నివేదికను ప్రజల ముందుంచుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల నుంచి అమరావతి రాజధాని పునర్నిర్మాణం వరకు, ఉచిత బస్సు ప్రయాణాల నుంచి గూగుల్ ఏఐ డేటా సెంటర్ వరకు, సంక్షేమం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, డిజిటల్ గవర్నెన్స్, నీటి ప్రాజెక్టులు, విద్యుత్ రంగం, శాంతిభద్రతలు వంటి ప్రతి విభాగంలో తమ ప్రభుత్వం దూసుకెళ్లిందని కూటమి చెబుతోంది.

**“సూపర్ సిక్స్” నుంచి “సూపర్ డెలివరీ” వరకు**

ఎన్నికల సమయంలో అత్యంత కీలకంగా నిలిచిన “సూపర్ సిక్స్” హామీల అమలు ఇప్పుడు ప్రభుత్వానికి ప్రధాన రాజకీయ బలం అవుతోంది. “తల్లికి వందనం” పథకం కింద 67 లక్షల మందికిపైగా విద్యార్థులకు రూ.10 వేల కోట్లకుపైగా ఆర్థికసాయం అందించగా... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటికే 63 కోట్ల ప్రయాణాల మార్క్ దాటింది. దివ్యాంగులకు ఉచిత ప్రయాణం, దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, రైతులకు “అన్నదాత సుఖీభవ”, పెన్షన్ల పెంపు వంటి పథకాలతో ప్రభుత్వం సంక్షేమాన్ని భారీ స్థాయిలో విస్తరించింది. ప్రత్యేకంగా పెన్షన్ వ్యవస్థలో నెలనెలా డబ్బు ఇంటి వద్దకే చేరడం గ్రామీణ వర్గాల్లో ప్రభుత్వానికి బలమైన మద్దతు తెచ్చిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు ఆటో డ్రైవర్లు, మత్స్యకారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది వంటి వృత్తి వర్గాలను ప్రత్యక్ష నగదు సాయంతో ఆకట్టుకునే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది.

**బీసీ--ఎస్సీ--ఎస్టీ--మైనారిటీ సమీకరణ**

సామాజిక సమీకరణ పరంగా కూడా ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. ఎస్సీ వర్గీకరణను వివాదాల్లేకుండా అమలు చేయడం, మత్స్యకారులకు నీటి వనరుల హక్కులు, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్, చేనేతలకు ఉచిత విద్యుత్, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ వంటి నిర్ణయాలు వర్గాలవారీగా రాజకీయ బలం పెంచుకునే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్లు, పురోహితులు, నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనాల పెంపు ద్వారా అన్ని

2లో

### నేర్చుకోవడం

# నిరంతర ప్రక్రియ

- వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరత అధిగమించొచ్చు
- నేను కాదు మనం అనుకోండి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో సీఎం చంద్రబాబు నాయుడు



ఏపీ బ్యూరో(ప్రజాసీమ): “నేర్చుకోవడం అనేది ఎప్పటికీ ఆగని ప్రక్రియ. ప్రపంచంలో ఎక్కడ మంచి విధానాలు ఉన్నా వాటిని అధ్యయనం చేసి అమలు చేస్తేనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుంది” అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాజధానిలో గురువారం జిల్లా కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ఆయన పాలనలో కొత్త ఆలోచనలు, వేగవంతమైన అమలు, ప్రజలకు నేరుగా ఫలితాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**సింగపూర్ మోడల్ పైలెట్ ప్రాజెక్టుకు యాక్షన్ ప్లాన్**

సింగపూర్‌లో అమలవుతున్న పాలనా విధానాలను ప్రస్తావించిన సీఎం, అక్కడి ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం ఏర్పడటానికి కారణం సమర్థవంతమైన పరిపాలన అని చెప్పారు. అలాంటి ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని అధికారులకు సూచించారు. సింగపూర్ నమూనాలో ఒక జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేసే దిశగా 90 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

“నేను కాదు... మనం” అనే భావనతో ప్రభుత్వ యంత్రాంగం ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ ఆలోచన తన నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో జిల్లా కలెక్టర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, ప్రతి జిల్లా బెంచ్‌మార్క్‌గా నిలవాలని సూచించారు. నిధుల కొరతను కారణంగా చూపకుండా వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్తే పరిష్కారాలు దొరుకుతాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో, ప్రజలకు సేవల డెలివరీ అంతే ముఖ్యమని చెప్పారు. “స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్” కేవలం నినాదంగా మిగలకుండా, ప్రజలకు కనిపించే ఫలితాలుగా మారాలని అధికారులకు స్పష్టం చేశారు.

2లో

ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819
జాతీయ తెలుగు దినపత్రిక



# 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం పంపింది

స్పందించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పిన భారత సాయుధ దళాలను ఆయన అభినందించారు. దేశ రక్షణలో భారత సామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పందిస్తూ, దేశాన్ని రక్షించడంలో భద్రతా దళాలు చూపిన ధైర్యసాహసాలకు, అచంచలమైన నిబద్ధతకు వందనాలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ జాతీయ గర్వానికి, న్యాయానికి, దృఢ సంకల్పానికి ప్రతీక అని ఆయన అన్నారు. మంత్రి నారా లోకేశ్ సైతం 'ఎక్స్'లో స్పందిస్తూ, భారత సార్వభౌమత్వాన్ని కాపాడటంలో దేశం యొక్క దృఢ సంకల్పాన్ని ఈ ఆపరేషన్ ప్రదర్శించిందని అన్నారు. ఈ కీలక సమయంలో ప్రధాని మోదీ నాయకత్వ పటిమను ఆయన కొనియాడారు. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా సైనికుల ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. "భారత్‌పై దాడి చేస్తే.. భారత్ సమాధానమిస్తుంది" అనే సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ఇచ్చిందని బండి సంజయ్ పేర్కొన్నారు. మౌనంగా ఉండే భారత్ ఇది కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారని ఆయన అన్నారు.

# ప్రజలు ఎన్నుకొన్న టీవీకేని అడ్డుకోవడం నేరం

మనందరికీ తెలుసు. విజయ్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదన్నదే 'ఢిల్లీ' (కేంద్ర నాయకత్వం) ఆలోచన'. అని ఆయన ఆరోపించారు. గవర్నర్‌పై బీజేపీ నాయకత్వం నుంచి ఒత్తిడి ఉందని ఠాగూర్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.తమిళనాడులో బీజేపీకి కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారు.. ఒక్క ఎమ్మెల్యేతోనే బీజేపీ రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇది చాలా దురదృష్టకరం. మార్పు కోసం ఆశగా తమిళ ప్రజలు ఓటు వేసిన ఒక ప్రభుత్వాన్ని అడ్డుకోవడం నేరమని తాము భావిస్తున్నామని ఆయన చెప్పారు. రాజ్యాంగ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా విజయ్‌ను సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ సూచించారు. 'విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి త్వరగా ఆహ్వానించాలని, సభలో బలాన్ని నిరూపించుకోవడానికి అనుమతించాలని భావిస్తున్నా.. అదే న్యాయం.' అని ఠాగూర్ అన్నారు. ప్రచార సమయంలో విజయ్ పదేపదే ఎదుర్కొన్న రాజకీయ 'అడ్డంకులు' చివరికి ఆయనకు అనుకూలంగా పనిచేశాయని ఠాగూర్ అన్నారు. 'విజయ్ తమిళనాడుకు ఆశాకిరణం. మీరు ఎవరినైనా ఆపినప్పుడు, ఎవరికైనా అడ్డంకులు సృష్టించినప్పుడు, ప్రజలు మీ పట్ల సానుభూతి చూపడం ఖాయం.' అని ఆయన చెప్పుకొచ్చారు. టీవీకేకు మద్దతు ఇవ్వాలని పార్టీ నిర్ణయించుకున్న తర్వాత కాంగ్రెస్ 'వెన్నుపోటు పొడిచిందని' ఆరోపించిన డీఎంకేలోని కొన్ని వర్గాలను కూడా కాంగ్రెస్ ఎంపీ విమర్శించారు.

# అల్లూరి నేటి తరానికి ఆదర్శం

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు





రాజంపేట (ప్రజా సీమ) : తెలుగుజాతి గౌరవించే ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబం,అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గిరిజన హక్కుల పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ ఆర్ అండ్ బి అతిథి గృహం నందు ఉన్న అల్లూరి వర్ధంతి సందర్భంగా మహనీయుని సేవలు స్మరిస్తూ పూలమాలలు వేసి చమర్తి జగన్ మోహన్ రాజు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పీడితుల దుఃఖాన్ని తన దుఃఖంగా భావించిన యోధుడు అల్లూరేని జగన్ మోహన్ రాజు కొనియాడారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు వంటి దేశభక్తులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ తరాలు తమను తాము గొప్పగా మలుచుకోవాలని జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు,తెలుగు యువత పట్టణ అధ్యక్షులు నూకల రమేష్ బాబు,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు జగదాభి పాండురాజు, మాజీ మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు,శంకర్ రాజు,శివకుమార్ రాజు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కర్రీమ్, క్షత్రియులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నెలకు నాలుగు ఘన కార్యాలు

మతాలపై సమాన దృష్టి చూపుతున్నామనే సంకేతం ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోంది. మైనారిటీ సంక్షేమానికి వేల కోట్ల కేటాయింపులు చేయడం కూడా అదే వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది.

**"ఉద్యోగాల ప్రభుత్వం" అనే ముద్ర కోసం ప్రయత్నం**

మెగా డీఎస్సీకి ముఖ్యమంత్రి తొలి సంతకం చేయడం ప్రతీకాత్మకంగా మారింది. దాదాపు 16 వేల టీచర్ పోస్టుల భర్తీ, కానిస్టేబుల్ నియామకాలు, కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల వంటి చర్యలతో యువతలో ప్రభుత్వంపై సానుకూలత పెంచే ప్రయత్నం కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల చెల్లింపుల ద్వారా ఉద్యోగ సంఘాల అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

**అమరావతి... మళ్లీ కేంద్ర బిందువు**

ఈ 23 నెలల పాలనలో అత్యంత రాజకీయ ప్రాధాన్యం పొందిన అంశం అమరావతే. "శాశ్వత, ఏకైక రాజధాని"గా కేంద్ర గెజిట్ రావడం కూటమి ప్రభుత్వానికి పెద్ద మైలురాయిగా ప్రచారం అవుతోంది. బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు, అమరావతి--బెంగళూరు హైవే, విజయవాడ--మచిలీపట్నం 6 లైన్ రహదారి వంటి భారీ ప్రాజెక్టులు ఇప్పుడు అభివృద్ధి కథనానికి కేంద్రంగా మారాయి. ప్రభుత్వం ఒకవైపు అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తూనే... మరోవైపు విశాఖ, తిరుపతిని ప్రాంతీయ అభివృద్ధి కేంద్రాలుగా ప్రకటించడం ద్వారా ప్రాంతీయ సమతౌల్య రాజకీయాన్ని కూడా పాటిస్తోంది.

**పెట్టుబడుల జోరు... నిజంగా ఉద్యోగాల వర్షమేనా?**

సీఐఐ సమ్మిట్, దావోస్ సమావేశాల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతోంది. గూగుల్ ఏఐ డేటా సెంటర్, రిలయన్స్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, ా+, క్యారియర్, గ్రీన్ అమోనియా, సెమీ కండక్టర్ పరిశ్రమలు వంటి భారీ ప్రకటనలు రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. అయితే ప్రతిపక్షాలు మాత్రం "ఒప్పందాలు వేరు... నేలమీద పెట్టుబడులు వేరు" అని ప్రశ్నిస్తున్నాయి. ప్రకటించిన లక్షల ఉద్యోగాల్లో వాస్తవంగా ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? పరిశ్రమలు ఎంతవరకు భూమిపైకి వచ్చాయి? అనే అంశాలపై రాబోయే కాలంలో పెద్ద రాజకీయ చర్చ జరిగే అవకాశం ఉంది.

**రైతు -- నీరు -- పోలవరం... గ్రామీణ ఫోకస్**

ధాన్యం కొనుగోళ్లు, 24 గంటల్లో చెల్లింపులు, పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్, పోలవరం వేగవంతం, హంద్రీనీవా, వెలిగొండ, చింతలపూడి వంటి ప్రాజెక్టుల పురోగతిని ప్రభుత్వం ప్రధాన విజయాలుగా చెబుతోంది. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం ద్వారా రైతు పాలనలో భాగస్వామ్యాన్ని పెంచామని కూడా ప్రచారం చేస్తోంది. ప్రత్యేకంగా రాయలసీమలో చెరువులు నింపడం, తాగునీటి ప్రాజెక్టులు వేగవంతం చేయడం ప్రాంతీయ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నంగా కనిపిస్తోంది.

**డిజిటల్ గవర్నెన్స్ నుంచి గ్రీన్ ఎనర్జీ వరకు**

"వాట్సప్ గవర్నెన్స్" ద్వారా వెయ్యికి పైగా సేవలు అందించడం, డేటా ఆధారిత పరిపాలన, విపత్తుల నిర్వహణలో సాంకేతిక వినియోగం వంటి అంశాలతో ప్రభుత్వం "టెక్నాలజీ డ్రివెన్ గవర్నెన్స్" అనే ఇమేజ్‌ను నిర్మిస్తోంది. ఇక గ్రీన్ ఎనర్జీలో 90 గిగావాట్ల ఒప్పందాలు, ఈవీలకు ప్రోత్సాహం, ప్లాస్టిక్ నిషేధం, నెట్ జీరో లక్ష్యాలు వంటి అంశాలతో భవిష్యత్ పెట్టుబడుల దిశగా అడుగులు వేస్తున్నామని చెబుతోంది.

**రాజకీయంగా ఈ 100 పాయింట్ల అర్థమేంటి?**

ఈ "100 విజయాలు" జాబితా కేవలం ప్రభుత్వ నివేదిక మాత్రమే కాదు... ఇది రాబోయే ఎన్నికలకు ముందస్తుగా తయారు చేసుకున్న ప్రభుత్వ పనితీరు విశ్లేషణగా కూడా కనిపిస్తోంది. "మేము మాట ఇచ్చాం... నిలబెట్టాం" అనే సందేశాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

అయితే మరోవైపు ప్రతిపక్షాలు మాత్రం ఈ విజయాల జాబితాలో ప్రకటనలు ఎక్కువ... పూర్తి స్థాయి ఫలితాలు తక్కువ అని విమర్శిస్తున్నాయి. భారీ పెట్టుబడులు, బుల్లెట్ ట్రైన్‌లు, డేటా సెంటర్లు, పరిశ్రమల ప్రకటనలు నిజంగా నేలమీద కనిపించాలంటే మరికొంత సమయం పడుతుందని చెబుతున్నాయి.

# డియర్ నెస్ రిలీఫ్ పెన్షనర్లందరికీ చెల్లించాలి

## - సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ






మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వ పెన్షనర్లకు జనవరిలో చెల్లించవలసిన 30 నెలల డి.ఆర్ బకాయిలు అనగా డియర్ నెస్ రిలీఫ్ బకాయిలు కొందరికి చెల్లించి కొందరికి చెల్లించలేదని,ఈ నేపథ్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మునిగోపాల కృష్ణ,ఉపాధ్యక్షులు జగన్మోహన్,జాయింట్ సెక్రెటరీ నాగరాజ,ట్రెజరర్ కుమారస్వామి,ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు శ్రీనివాసులు,తిమ్మయ్య,ఆర్గనైజర్ నారా వెంకటరమణ నాయుడు,టిఎస్ఏ కృష్ణమూర్తి,రాజన్నలు మదనపల్లెలోని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ లోకేష్ బాబుని కలిసి జనవరి 2026లో రావలసిన డియర్ నెస్ రిలీఫ్ బకాయిలు 30 నెలల బకాయిలు కొందరికి చెల్లించారని,కొందరికి చెల్లించలేదని తెలిపారు.గత ఏడాది మార్చిలో నరేష్ మరియు ఏటిఓ లోకేష్ బాబులకి 34 మంది పెన్షనర్లకు అందవలసిన డి.ఆర్ బకాయిలు 30 నెలలది చెల్లించాలని అభ్యర్థించారు.దీనిపై ఏటిఓ,ఎస్.టి.ఓ స్పందిస్తూ వీరందరి పేర్లు జమ చేస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం మే 7, 2026న పెన్షనర్స్ అందరూ కలిసి ఏటీవో,ఎస్.టి.ఓలకి గతంలో మేము ఇచ్చినటువంటి 34 మంది సభ్యుల జాబితాలో కొందరి పేర్లు నమోదు కాలేదని,కావున బకాయి రావలసినటువంటి అందరి పేర్లు నమోదు చేయవలసిందిగా కోరుచున్నామన్నారు.పెన్షనర్స్ అభ్యర్థనకు అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ లోకేష్ బాబు,ఎస్.టి.ఓ నరేష్ చక్కగా స్పందించి అందరి పేర్లు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.జనవరి 2026న రావలసిన డియర్ నెస్ రిలీఫ్ బకాయిలు పెన్షనర్స్ అందరికీ మే మాసము 2026లో జమ చేయవలసిందిగా అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలకృష్ణ మరియు ఇతర అసోసియేషన్ సభ్యులు ఏటిఓ,ఎస్.టి.ఓలకి వినతి పత్రం సమర్పించారు.

# నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ

రాష్ట్రంలో ప్రతిరోజూ పెట్టుబడుల ఒప్పందాలు, తరచూ శంకుస్థాపనలు జరుగుతున్నాయని పేర్కొన్న సీఎం, అదే వేగంతో అమలు కూడా జరగాలని చెప్పారు. యువతకు ఉపాధి, రాష్ట్రానికి పెట్టుబడులు, జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కాలేజీ రోజుల్లో తాను రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడిపానని గుర్తు చేసుకున్న చంద్రబాబు, ఇప్పుడు అదే సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం అభివృద్ధి దిశలో ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అన్నారు.

# చక్రాలమడుగులో కాంక్రీట్ నిర్మాణాలు

## - రాజంపేట పట్టణానికి వరద ముప్పు : ఎస్.ఎస్.పంత్



ఏపీ బ్యూరో(ప్రజా సీమ) : వరదలు, పర్యావరణ ప్రతికూలతలు మరియు నిర్మాణపరమైన ప్రమాదాలను నివారించడానికి నదీ తీరాల్లో నిర్మాణాలను కఠినంగా నియంత్రిస్తారు. సాధారణంగా నదీ తీరం అంచు నుండి 50 నుంచి 100 మీటర్ల మేర అభివృద్ధి నిషేధిత మండలం(భఃమి) అవసరం. అంటే ఆ భూమిని అలాగే వదిలేయాలి. నిబంధనలు స్థానిక పరిస్థితులనుబట్టి మారుతూ ఉంటాయి, కానీ సాధారణంగా వరద మైదానాలను కాపాడటానికి మరియు కాలుష్యాన్ని నివారించడానికి శాశ్వత నిర్మాణాల నిషేధం ఉంటుంది.

**సాధారణ ఆంక్షలు మరియు సెట్‌బ్యాక్‌లు బఫర్ జోన్లు,,,**

అనేక రాష్ట్రాలలో, నదీ తీరాల నుండి 100 మీటర్ల బఫర్ జోన్ "నిర్మాణ రహిత జోన్"గా పని చేస్తుంది. అనేక ప్రాంతాలలో గంగా నది అంచుకు 100-200 మీటర్ల లోపల నిర్మాణాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+ు) పరిమితం చేస్తుంది. కొండ ప్రాంతాలలో 50 మీటర్ల నిర్మాణ రహిత జోన్‌ను తరచుగా కఠినంగా అమలు చేస్తారు. అదనపు ఆంక్షలు 100 మీటర్ల వరకు విస్తరించి ఉంటాయి. చిన్న చిన్న నీటి మార్గాలకు కనీసం 30 మీటర్ల సెట్‌బ్యాక్ అవసరం. కొన్ని సందర్భాల్లో ఈ జోన్‌లో ల్యాండ్ స్కేపింగ్, పచ్చని ప్రదేశాలు లేదా చిన్న తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే అనుమతించబడతాయి.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్దిష్ట నియమాలు**

సాధారణంగా నదీ సరిహద్దు నుండి 50-100 మీటర్లు. దూరాలను కేవలం నీటి మట్టం నుండి కాకుండా అధిక వరద రేఖ లేదా నదీ తీరం అంచు నుండి కొలుస్తారు. ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ 2012 (2017/2025 సవరణ) నిబంధనల మేరకు నదీ గర్భంలో ఎటువంటి నిర్మాణాలు చెయ్యకూడదు. మున్సిపాలిటీలో అయితే 50 మీటర్లు మున్సిపాలిటీ కి ఆవల 50 మీటర్లు నది యొక్క అంచు నుండి వదిలి వేయాలి. అదే విధంగా కాలువలకు 9 మీటర్లు నాలాలకు రెండు మీటర్లు వదలాలి. ఈ ప్రాంతాలలో అక్రమ నిర్మాణంపై చట్టపరమైన చర్యలు మరియు తరచుగా కూల్చివేత ఉత్తర్వులతో సహా కఠినమైన జరిమానాలు విధించబడతాయి. నిర్మాణం చేపట్టే ముందు, మీ నిర్దిష్ట ప్రదేశానికి సంబంధించిన అధిక వరద స్థాయి మరియు పరిమిత దూరాన్ని నిర్ధారించుకోవడానికి స్థానిక అభివృద్ధి ప్రణాళికలు మరియు నీటిపారుదల శాఖను సంప్రదించడం చాలా అవసరం. 200 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్న భూభాగంలో ఏ భవనం యొక్క నిర్మాణం లేదా పునర్నిర్మాణానికి అనుమతి లేదు. ఈ నిబంధనలు తుంగలో తొక్కి రాజంపేట మునిసిపాలిటీ చక్రాల మడుగులో నిర్మాణాలను ఎట్లా అనుమతించింది? రోజూ ఈ మార్గంలో ప్రయాణించే నీటిపారుదల శాఖ, రెవిన్యూ శాఖ ఏమి చేస్తూ ఉన్నాయన్నది ఉన్నతాధికారులు విచారణ జరిపి నిర్ణయించాల్సి ఉంది.

# కౌలు రైతులు సి.సి.ఆర్.సి కార్డుల కొరకు - వెంటనే దరఖాస్తు చేసుకోండి



తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు (ప్రజా సీమ ): రైల్వే కోడూరు మండలంలోని కౌలు రైతులందరూ ప్రస్తుత సాగు సంవత్సరానికి సంబంధించి సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ - క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్స ) జారీ ప్రక్రియ ప్రారంభమైనదని .పంట సాగు చేస్తున్న కౌలు రైతులు ఎవరైనా ప్రభుత్వ లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డును కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఈ సందీప్ ఒక మీడియా ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన రైతులు వెంటనే తమ గ్రామ పరిధిలోని రైతు సేవ కేంద్రాలను (ఆర్ ఎస్కె ) గానీ లేదా గ్రామ రెవెన్యూ అధికారులను (వీర్వో ) గానీ సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు

**ముఖ్య గమనికలు :** రైతులు తమ ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ మరియు భూమి యజమాని ఆధార్, పట్టాదారు పాస్ బుక్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.

ఈ కార్డు కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే వర్తిస్తుందన్నారు

**భూ యజమానులకు విజ్ఞప్తి :** ఈ కార్డు ద్వారా కౌలు రైతుకు కేవలం సాగు పైన మరియు పంట రుణం పైన మాత్రమే హక్కు ఉంటుందని . దీనివల్ల మీ భూమి హక్కులకు ఎలాంటి భంగం కలగదన్నారు . ప్రతి ఒక్క రైతు సహకరించి కౌలు రైతులు ఈ కార్డు పొందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి పి సందీప్ ఈ సందర్భంగా సూచించారు.

# మిట్స్ ఎంబిఏ విద్యార్థులచే పారిశ్రామిక సందర్శన

## - హాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్ విజిట్



కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఎంబీఏ రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం చిత్తూరులోని హాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్‌కు పారిశ్రామిక సందర్శన విజయవంతంగా నిర్వహించబడిందని వైస్ చాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ గురువారం తెలిపారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు డెయిరీ పరిశ్రమలో అమలులో ఉన్న కార్యకలాపాల నిర్వహణ విధానాలపై విలువైన అవగాహన పొందారు. సందర్శన సందర్భంగా పాల సేకరణ,పాలు పంపిణీ,పాశ్చరైజేషన్ ప్రక్రియ,అలాగే పాలు మరియు పాల ఉత్పత్తుల ప్యాకేజింగ్ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మార్కెట్ అవసరాలు మరియు వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా వివిధ పరిమాణాల్లో పాలు ప్యాకెట్లను సరఫరా చేసే పంపిణీ విధానాల గురించి కూడా వారు అవగాహన పొందారు. సంస్థ ప్రతినిధులు విద్యార్థులను వివిధ విభాగాల ద్వారా మార్గనిర్దేశనం చేస్తూ,ప్రతి విభాగంలో జరుగుతున్న కార్యాచరణలను సమగ్రంగా వివరించారు. విద్యార్థులు నాణ్యత నియంత్రణ చర్యలు,పరిశుభ్రత ప్రమాణాలు,అలాగే డెయిరీ రంగంలో అమలులో ఉన్న సరఫరా గొలుసు నిర్వహణపై ముఖ్యమైన విషయాలను తెలుసుకున్నారు. అదనంగా,పరిశ్రమలో ఎదురయ్యే సవాళ్లు,పోటీ పరిస్థితులు మరియు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యూహాలు రూపొందించే విధానంపై కూడా అవగాహన పొందారు. ఈ పారిశ్రామిక సందర్శన విద్యార్థుల విశ్లేషణాత్మక ఆలోచన,సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు మేనేజ్మెంట్ దృక్పథాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని వైస్ చాన్సలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ. జ్ఞానప్రసూన,డాక్టర్ కే.ఎలియ్య మరియు అధ్యాపక బృందం మరియు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా అన్నమయ్యను తీర్చిదిద్దుదాం

## - మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
## - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పిలుపు



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పిలుపునిచ్చారు. గురువారం మదనపల్లిలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమానికి సంబంధించిన అవగాహన కరపత్రాలను సంయుక్త కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నివారణ,నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సంబంధిత వైద్య సేవా కేంద్రాలు,సమీకృత సలహా మరియు పరీక్షా కేంద్రాలు,స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడంతోపాటు, హెచ్ఐవి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన పరీక్షా సామగ్రి,మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎయిడ్స్ నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని,సమిష్టి కృషితో జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ మరియు కుష్టు నివారణ అధికారి డాక్టర్ రాధిక,కార్యక్రమ సమన్వయ అధికారి వి. భాస్కర్,జిల్లా సహకారశాఖ అధికారి త్యాగరాజు,వ్యవసాయ శాఖ జేడి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే చేనేత కుటుంబాలకు అండ

## - చేనేతలకు ఉచిత విద్యుత్ అందించిన కూటమి ప్రభుత్వం - నేతన్నల ముఖంలో చిరునవ్వు - టిడిపి సీనియర్ నేత పుత్త బాబు



సిద్ధవటం (ప్రజా సీమ) : రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల కుటుంబాలకు ఎంతో భరోసాగా నిలిచి ఉచిత విద్యుత్ అందించడం హర్షించదగ్గ విషయమని టిడిపి నేత పుత్త బాబు తెలిపారు మండలంలోని ఉప్పరపల్లి గ్రామం లో గురువారం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు వందల యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేశారని బీసీ సామాజిక వర్గాలకు టిడిపి ప్రభుత్వం తోనే అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని తెలిపారు ప్రతి చేనేత కార్మికునికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకం రూపొందిస్తుందని ప్రతి ఏటా నేతన్నకు 25 వేలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అర్హుల ఇంటి వద్దకే సంక్షేమం

## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు
## - జోరుగా కొనసాగుతున్న “చమర్తి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ” కార్యక్రమం







రాజంపేట,(ప్రజా సీమ) : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హుల గడప దాకా చేరుతున్నాయని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ “చమర్తి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ” కార్యక్రమంలో భాగంగా పార్టీ ముఖ్య నాయకులతో కలిసి 3వ రోజున 8,9 వార్డుల నందు చమర్తి జగన్ మోహన్ రాజు పర్యటించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం అని అంతేకాకుండా ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత చంద్రబాబు దేనని,ప్రతి మనిషి ఏదోరకంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారని చమర్తి జగన్ మోహన్ రాజు కొనియాడారు. అంతకుముందు వార్డు పర్యటనలో వివిధ రకాల సమస్యలను తీసుకురాగా ప్రధానంగా కరెంటు ఫోల్స్, డ్రైనేజ్ కాలువలు,రోడ్ల సమస్యలు ప్రధానంగా వారి దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన చమర్తి స్పందిస్తూ విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేస్తూ. కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్ రాజు ,మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్ , పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు , మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు ,మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, కౌన్సిలర్లు తాళ్ళపాక రాజేష్, మనుబోలు వెంకటసుబ్బయ్య,మాజీ కౌన్సిలర్లు మనుబోలు వెంకటేశ్వర్లు,మర్రిపల్లి రామచంద్రయ్య,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీం,మైనార్టీ నాయకులు గుల్జార్ భాష,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్, బూత్ కన్వీనర్లు అంజిబాబు ఆచారి,ఎద్దులపల్లి బాలాజీ నాయుడు,నాగ ముని ఆచారి ,శంకరాచారి,సన్నపనేని బాలాజీ నాయుడు, నాగరాజు,రాజీవ్ నగర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మ్యాంగో మార్కెట్ సందర్శించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

## - పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత నివ్వాలని సూచనలు



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె పట్టణంలోని పాత నీరుగట్టువారిపల్లి నందు మ్యాంగో మార్కెట్ ను ఎమ్మెల్యే షాజహాన్ బాషా మంగళవారం సందర్శించారు. స్థానిక ప్రజలకు సరైన మురుగు నీటి కాలువ లేని కారణంగా,అపరిశుభ్రతతో వారి ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. మామిడి వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడకుండా,పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. వ్యర్థాల నిర్వహణ లోపం వలన అపరిశుభ్రత దుర్వాసనతో ప్రజలు అంటు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో మామిడి మార్కెట్లో ఏర్పాటు చేసే డస్ట్ బిన్స్ లోనే మామిడి వ్యర్థాలు వేయాలన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు త్వరలోనే ఈ ప్రాంతంలో మురుగునీటి కాలువ నిర్మాణం చెపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమీషనరుకు ఆదేశాలను ఇస్తామన్నారు. అలాగే కదిరి రోడ్డులో టిప్పు సుల్తాన్ మైదానం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రానున్న వర్షకాలంలోపు అభివృద్ధి పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


# మన్యం వీరుడు సీతారామరాజు త్యాగం అజరామరం - అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి కితాబు



మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశభక్తిని పుణికిపుచ్చుకున్న అల్లూరి,తన గెరిల్లా యుద్ధ తంత్రంతో బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించారన్నారు. బ్రిటిష్ వారి చిత్రహింసల నుంచి మన్యం ప్రజలను రక్షించేందుకు స్వయంగా లొంగిపోయి,1924 మే 7న ప్రాణత్యాగం చేసిన అల్లూరి చరిత్ర భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అజరామరమని కొనియాడారు. దాస్య శృంఖలాలను తెంచేందుకు ఆయన చూపిన తెగువ,పట్టుదల నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ శ్రీనివాసులు,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వి. జె. రామకృష్ణ,కె. సురేష్ కుమార్ రెడ్డి,ఇతర పోలీసు అధికారులు,పోలీసు సిబ్బంది మరియు డీపీఓ సిబ్బంది,మహిళా పోలీసులు,హోంగార్డులు పాల్గొని విప్లవ వీరునికి నివాళులర్పించారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# జంక్షన్‌లో జనసేన




- కార్యకర్తలకు పవన్ కావాలి • నాయకులకు పవర్ కావాలి
- రాజంపేట లో క్రమ శిక్షణ తప్పిన సేనలు
- ఎవరికి వారే యమునా తీరే అనేలా వ్యవహారం
- హోదాల కోసం ఆరాటం తప్ప,పార్టీ బలోపేతం పై దృష్టి ఎక్కడ?




ఏపీ బ్యూరో(ప్రజా సీమ)పుష్కలమైన అభిమానులు,అధినేత కోసం ప్రాణం ఇచ్చే జనసైనికులు,తమ అధినేత పై చిన్న విమర్శ చేసినా అవతల పార్టీ కి చుక్కలు చూపే జనసైన్యం.గత ఎన్నికలలో 100 శాతం స్ట్రైక్ రేట్ తో రికార్డు కొట్టిన పార్టీ. అయితే కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ ఇచ్చే గౌరవానికి ఎవరైనా ఫిదా కావలసిందే.అయితే కార్యకర్తలకు కొదవ లేకున్నా రాజంపేట నియోజకవర్గం లో మాత్రం నాయకుల పవర్ పాలిటిక్స్ తో కార్యకర్తలను జంక్షన్ లో పెట్టేశారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

**హోదాల కోసం ఆరాటం,,పార్టీ బలోపేతం ఎక్కడ?**

రాజంపేట నియోజకవర్గం లో జనసేన పార్టీ లో క్రమ శిక్షణ లోపించింది అనేది కార్యకర్తల మాట.ఎందుకంటే పార్లమెంట్ సమన్వయ కర్తలు అంటూ ఇద్దరు నాయకులు చెలామణి అవుతున్నారు. ఏ కార్యక్రమం జరిగిన ఎవరికి వారే అనే రీతిలో వ్యవహారం ఉండడం తో ఇతర నాయకులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం.జనసేన రాజంపేట అసెంబ్లీ ఇంచార్జి గా అతికారి దినేష్ అని చెప్తుంటే కాదు నేను జనసేన ఇంచార్జి అని మరొకరు ఫేస్ బుక్ లో ఏకంగా జన సేనాని పైనే విమర్శలు చెయ్యడం,దీనికి తోడు నందలూరు కు చెందిన ఒక కార్యకర్త జగన్ పాలనే బాగుంది ఏకంగా కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చూస్తుంటే జనసేనలో క్రమశిక్షణ లోపించడమే కాకుండా ఒకవేళ అలా జరుగుతున్న పక్షంలో వాటిని సరిదిద్దే నాయకులు రాజంపేటలో కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఏవైనా సంఘటనలు జరిగితే జనసేనకు మద్దతుగా రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి నాయకులు వినిపిస్తున్నారు కానీ, రాజంపేట నుంచి మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. అసలు రాజంపేట పార్లమెంటుకు సంబంధించి, అసెంబ్లీకి సంబంధించి ఎవరు సమన్వయకర్తలు, ఎవరు పార్టీ ఆదేశాల ప్రకారం జరుపుకుంటున్నారు, అనేది పార్టీనుండే స్పష్టంగా ఆదేశాలు వస్తే కానీ కార్యకర్తలకు అయోమయం తప్పేలా లేదు. పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా తమ హోదాను నిలబెట్టుకోవడం, అధికారుల దగ్గర తమ పరపతిని పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్తులో స్థానిక ఎన్నికల్లో గాని, ఇతర ఎన్నికల్లో కానీ గ్లాసు గుర్తును ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నాయకులు కృషి చేయడం లేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి పార్టీకి పార్లమెంటు అసెంబ్లీలకు సంబంధించి ఒకే ఇంచార్జ్ ఉంటారు, అయితే రాజంపేటలో మాత్రం ఎవరికి వారే ఇన్చార్జిలని స్వయం ప్రకటిత నాయకులుగా మారిపోవడంతో ఎవరి దగ్గరికి వెళ్ళాలో తెలియక కార్యకర్తలు తికమక పడుతున్నారు. పుష్కలంగా స్వచ్ఛందంగా పనిచేసే కార్యకర్తలు ఉన్న వారిని పని చేయించుకునే ఆలోచనలో నాయకులు ఉన్నట్లు లేరని, ఎంతసేపు తమ పదవులు, అవసరాలు తప్ప భవిష్యత్తులో పార్టీ బలోపేతంపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. పార్టీలో క్రమశిక్షణ లోపించిందన్నడానికి నిదర్శనమే ఫేస్బుక్లో ఒక వ్యక్తి హల్చల్,




కలెక్టరేట్లో ఒక కార్యకర్త హల్చల్, సమన్వయకర్తలంటూ ఎవరికి వారు వేర్వేరు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని, వేర్వేరు గ్రూపులతో వ్యవహారాలు నడపడం చూస్తుంటే పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నా నాయకులు సిద్ధంగా లేరని సంకేతాలు స్పష్టంగా అర్థం అవుతున్నాయని పలు విమర్శలు వస్తున్నాయి.

**ఆయన కష్టం,,వీరితో నష్టం**

పవన్ కళ్యాణ్ రెక్కల కష్టం కొందరి నాయకుల వ్యవహార తీరుతో పార్టీకి తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉండడంతో అసలైన కార్యకర్తలు మదనపడుతు న్నారు.అధిష్టానం మంచి తనాన్ని ఆసరాగా తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వారిని అరికట్టి గట్టి చర్యలు తీసుకోక పోతే రాజంపేట పార్లమెంట్,అసెంబ్లీ నియోజకవర్గాలలో పరిస్థితి చేజారేలా కనిపిస్తుంది.ఇప్పటికైనా అసలు ఎవరు అధిష్టానం నుండి నియమించిన సమన్వయకర్తలు అనేది స్పష్టం అయితే కార్యకర్తలకు ఒక క్లారిటీ ఉంటుంది.అలాగే పార్టీ కి మేలు జరుగుతుంది.అలా కాకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ప్రకటించుకొని లెటర్ ప్యాడ్లు కొట్టించుకొని అధికారిక దగ్గరకు వెళ్తే మాత్రం గందరగోళం వ్యవహారంలో పరువు పోవడం తప్ప మరొకటి ఉండదు అనేది స్పష్టంగా అర్థం అవుతుంది.పవన్ కళ్యాణ్ కష్టాన్ని గుర్తు పెట్టుకొని స్వార్థం గా కాకుండా బాధ్యతగా వ్యవహరిస్తే బాగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఎవరి కోసం?**

రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి ఉంది.అంటే ఏ కార్యక్రమం అయినా కలిసి చేయాలి. మరి పార్టీ కార్యక్రమాలు మాత్రం సొంతంగా చేసుకోవచ్చు.

అయితే ప్రస్తుతం కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా కొందరి వ్యవహారం ఉందని పలు విమర్శలు వస్తున్నాయి.చంద్ర బాబు కంటే పవన్ కళ్యాణ్ ను ఎక్కువగా టార్గెట్ చేసే వైసీపీ కార్యకర్తలకు,నాయకులకు మేలు జరిగేలా వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఎవరి కోసం ఇలా వ్యవహరిస్తున్నారు అనేది అర్థం కానీ పరిస్థితి లా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే నాయకుల వ్యవహారం పార్టీ బలోపేతానికి,కార్యకర్తల భరోషకి ఉపయోగపడాలి కానీ ,పార్టీ కి నష్టం కలిగించేలా సొంత ప్రయోగాల కోసం పార్టీ ప్రయోజనాలను పణంగా పెడితే మాత్రం సేనాని కష్టం కు విలువ లేకుండా పోతుంది.అందుకే జనసేన కార్యకర్తలు ఒక్క తాటి పైకి వచ్చేలా ఎవరు పార్లమెంట్,అసెంబ్లీ ఇంచార్జి లు అనేది స్పష్టం అయితే గాని పరిస్థితి చక్కబడెలా లేదనేది సుస్పష్టం.

## మంత్రులను కలిసిన టిడిపి నేత లారీ సుబ్బరాయుడు



చిట్వేలి(ప్రజా సీమ) : టిడిపి జాతీయ పార్టీ విజయవాడ, కార్యాలయంలో పలువురు మంత్రులను చిట్వేలి మండలం మాజీ టిడిపి అధ్యక్షులు లారీ సుబ్బరాయుడు, పలువురు నాయకుల తో కలిసి సోమవారం, మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా కాకర్ల లారీ సుబ్బరాయుడు, మాట్లాడుతూ మండలం లో నెలకొన్న పరిస్థితులను మంత్రులకు వివరించడం జరిగిందన్నారు. పార్టీ అభ్యున్నతకు మా వంతు కృషి చేస్తున్నామని వివరించినట్లు తెలిపారు. పార్టీ పుట్టినప్పుడు నుండి ఇప్పటివరకు టిడిపి పార్టీని నమ్ముకునే ఉన్నామని మంత్రులకు వివరించినట్లు తెలిపారు. మండలంలో అభివృద్ధి తో పాటు పార్టీ సంస్థాగత విషయాలు పార్టీలో నెలకొన్న విధివిధానాలు వివరించామని ఆయన తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో పలువురు చిట్వేలి టిడిపి నేతలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

### - అగ్నిమాపక కేంద్ర అధికారి బి.శివరామిరెడ్డి




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ మ్యాక్ డ్రిల్ నిర్వహించినట్లు వేంపల్లె అగ్నిమాపక కేంద్ర అధికారి బి.శివరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు ఆర్పె పద్ధతులపై వివరించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లను సురక్షితంగా ఉపయోగించాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంబవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహమ్మద్ సాలార్, చిన్ను, భీమాంజనేయులు, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మే 18న 'చలో ఏపీఎండీసీ'

### - నేటి నుంచే సంతకాల సేకరణ

తిరుపతి జిల్లా బ్యూరో, (ప్రజా సీమ) : ఏపీఎండీసీ మనుగడను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈనెల 18న 'చలో ఏపీఎండీసీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీఎండీసీ పరిరక్షణ పోరాట కమిటీ ప్రకటించింది. గురువారం తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో సీహెచ్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ కందారపు మురళి మాట్లాడుతూ సంస్థపై ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 30 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మరియు అధికారులు పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై 60 లక్షల టన్నుల బల్క్ టెండర్లను కట్టబెట్టడం వల్ల మంగపేటలో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు.

**సంతకాల సేకరణ ప్రారంభం**

సంస్థ పరిరక్షణే నినాదంగా నేటి నుంచే భారీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కమిటీ వెల్లడించింది. సేకరించిన సంతకాలను ముఖ్యమంత్రికి పంపనున్నట్లు తెలిపింది. రాజకీయాలకు అతీతంగా కార్మికులు, మిల్లు యజమానులు, స్థానిక ప్రజలు ఈ పోరాటంలో పాల్గొని మే 18న జరగబోయే 'చలో ఏపీఎండీసీ'ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది.




**పోరాట కమిటీ ప్రధాన డిమాండ్లు**

బెరైటీస్ రాయిని నేరుగా ఎగుమతి చేయకుండా, పౌడర్ రూపంలో మాత్రమే ఎగుమతి చేయాలి. దీనివల్ల స్థానిక మిల్లులకు, కార్మికులకు ఉపాధి దక్కుతుంది. సంస్థ అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతులకు, కార్మికులకు పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒకే సంస్థ, ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి. సుబ్రహ్మణ్యం, బెరైటీస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు మాచినేని విశ్వేశ్వర నాయుడు, పారిశ్రామికవేత్తలు హరినాథ్ రెడ్డి, చెన్న రాయుడు, లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, రాజయ్య నాయుడు, సరిత, శ్రీనివాసులు మరియు కార్మిక సంఘ నాయకులు వెంకటేష్, దేవకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత సభ, హరి కథ కార్యక్రమాలు




రాజంపేట,(ప్రజా సీమ) : అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం తాళ్లపాకలో సంగీత సభ, హరికథ కార్యక్రమాలు జరిగాయి.తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉదయ భాస్కర్ రెడ్డి, కె. విష్ణు ప్రియలు అన్నమాచార్యల కీర్తనలు ఆలపించారు. వయోలిన్ హరి, తబలా నాగేంద్ర ప్రసాద్ శృతి భవాని రాజేంద్ర ప్రసాద్ లు పాల్గొన్నారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి జి. అనురాధ వారి బృందంచే హరికథ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి. లత, తాళ్లపాక దేవాలయాల ఇన్స్పెక్టర్ బాలాజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

# బాలికల విద్యతోనే దేశ అభివృద్ధికి పునాది

### - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా వెల్లడి
### - ఘనంగా బేటికో బచావో బేటికో పడావో కార్యక్రమం





మదనపల్లె (ప్రజా సీమ):బేటికో బచావో బేటికో పడావో కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా మదనపల్లి ఐసిడిఎస్ కార్యాలయంలో మదనపల్లి నియోజకవర్గ పరిధిలో పదో తరగతి పాసైన విద్యార్థినులకు గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలకు ఉచితంగా ఫైల్స్ ఫోల్డర్స్ ఎమ్మెల్యే తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐసిడిఎస్ అధికారులు బాలికలకు ఉచితంగా ఫైల్స్ అందించడం చాలా సంతోషంగా ఉందని,ఆడబిడ్డలు అంటే ప్రతి ఇంటికి లక్ష్మీదేవితో సమానమని,ఆడబిడ్డలని ప్రోత్సహించడం చదివించడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. మదనపల్లి నియోజకవర్గ పరిధిలో 10వ తరగతిలో ఫస్ట్ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఇంటి స్థలము,నిర్మాణం కోసం 3 లక్షల రూపాయలు అందిస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామని,త్వరలో ముగ్గురు విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలం అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ నాగవేణి,ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి,ఐసీడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరసం ఆధ్వర్యంలో ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

### - పూలమాలలు వేసి నివాళులర్పించిన సంఘం సభ్యులు




మదనపల్లె (ప్రజా సీమ) : నోబెల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ 165వ జయంతిని పురస్కరించుకొని మదనపల్లె రచయితల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక బిటి కళాశాలలో రవీంద్ర నాథ్ కాటేజ్ ఎదుట గల ఆయన విగ్రహానికి మరసం ఉపాధ్యక్షులు నాగభూషణం,కార్యదర్శి లింగాల యుగంధరాచారి, కోశాధికారి రామ్మోహన్ నాయుడు,గాయకులు వాసుదేవరావు,సభ్యులు,మ.ర.సం కవులు,రచయితల ఆధ్వర్యంలో రవీంద్రుడి జయంతిని జరుపుకున్నారు. అలాగే ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ 1913లో నోబెల్ బహుమతి పొందిన మొదటి ఆసియా వ్యక్తి అన్నారు. మన జాతీయ గీతం జన గణ మనను కూడా ఆయనే రచించారని,మదనపల్లె బిటి కళాశాలలోనే బెంగాల్ నుండి ఆంగ్లంలోకి తర్జుమా చేశారని గుర్తుచేశారు. ?ఆయన కేవలం కవి మాత్రమే కాదు,గొప్ప తత్వవేత్త,చిత్రకారుడని గుర్తు చేశారు. ఠాగూర్ ఆలోచనలు,రచనలు నేటికీ విద్యావ్యవస్థలో,సమాజంలో ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు. బిటి కళాశాలలో రవీంద్రుని రచనలు ఎంతగానో తమను ప్రభావితం చేశాయని వెల్లడించారు.

# సమిష్టి గా సమస్యల పరిష్కారం కు కృషి చేద్దాం

### - పలు సమస్యలపై చమర్తితో భేటీ అయిన జనసేన నేత అతికారి కృష్ణ
### - కలిసికట్టుగా ముందుకెళ్తాం - చమర్తి జగన్ మోహన్ రాజు




రాజంపేట(ప్రజా సీమ) : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పలు రకాల సమస్యలపై రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ని రాజంపేట ఆర్ అండ్ బి అతిథి గృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా పలు విషయాలపై జనసేన పార్టీ సీనియర్ నాయకులు అతికారి కృష్ణ చర్చించారు. ఈ సందర్భంగా ఇరువురి నాయకుల మధ్య తాజా రాజకీయ పరిస్థితులు మరియు అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య నాయుడు,సిద్ధవటం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్,ఒంటిమిట్ట సింగల్ విండో చైర్మన్,ఊటుకూరు మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య,భువనగిరి పల్లె కేఎల్ నరసింహ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల సాగర్, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీం, నూగల రమేష్ బాబు పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో“ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు దఫాలు” కార్యక్రమానికి శ్రీకారం



కలకడ(ప్రజా సీమ) : కలకడ మండలంలోని మాదినేనిపాలెం గ్రామంలో “ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు దఫాలు” కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ అధ్యక్షత వహించారు. గ్రామ ప్రజలు, రైతులు, మండల స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను గ్రామసభలో వినిపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజలకు నేరుగా సేవలు అందించేందుకు “ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు దఫాలు” కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నాలుగు దఫాల కార్యక్రమంలో తొలి దఫాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, రెండవ దఫాలో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. మూడవ దఫాలో పిటిషనర్లకు తగిన ఉత్తర్వులు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, నాలుగవ దఫాలో న్యాయపరమైన సమస్యలు ఉన్న అంశాలపై ప్రజల సమక్షంలో అవగాహన కల్పిస్తూ తగిన సూచనలు, పరిష్కార మార్గాలను తెలియజేస్తామని వివరించారు. గ్రామసభలో రైతులు తమ భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించగా అధికారులు వాటిని స్వీకరించి నమోదు చేశారు. రైతుల సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### - మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలి
### - పి.కె.యం.యు.డి.ఎ సమీక్ష సమావేశం నిర్వహణ






మదనపల్లె (ప్రజా సీమ) : పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పికెయంయుడిఎ) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పికెయంయుడిఎ చైర్ పర్సన్ బి.ఆర్.సురేష్ బాబు,జిల్లా సంయుక్త కలెక్టర్,పి.కె.యం.యు.డి.ఎ వైస్ చైర్ పర్సన్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మదనపల్లెలోని పి.కె.యం.యు.డి.ఎ కార్యాలయంలో చైర్ పర్సన్ బి.ఆర్.సురేష్ బాబు ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక,ఇంజినీరింగ్ శాఖల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మరియు వైస్ చైర్మన్లు మాట్లాడుతూ గుడిపల్లి మండలం,గుండ్లసాగరం గ్రామపంచాయతీ పరిధిలో కుప్పం ఏరియాలో సుమారు 30.865 ఎకరాల భూమిని గుర్తించి,పి.కె.యం.యు.డి.ఎ ద్వారా ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా లేఔట్ ప్లాన్లు రూపొందించడం,ప్లాట్ల విభజన,రహదారులు, డ్రైనేజీలు,విద్యుత్,తాగునీరు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అంచనాలను సత్వరమే సిద్ధం చేయాలని సూచించారు. అలాగే పి.కె.యం.యు.డి.ఎ పరిధిలో ఉన్న అనధికార లేఔట్లను గుర్తించినట్లు పేర్కొంటూ,ప్రభుత్వం జారీ చేసిన 2025 జీవో నెంబర్ 134 ప్రకారం సంబంధిత యజమానులకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగించాలన్నారు. పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పలమనేరు,కుప్పం,మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని అన్ని మున్సిపాలిటీ ప్రాంతాల్లో ప్రజలకు స్వాగతం పలికే విధంగా వెల్కమ్ హోర్డింగ్స్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా పరిపాలనాపరమైన అంశాల్లో సమర్థవంతమైన విధానాలు పాటిస్తూ,అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సెక్రటరీ,పరిపాలనాధికారి,అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,అసిస్టెంట్ ఇంజనీర్,ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతర కు హాజరైనవిభిన్నప్రతిభావంతులరాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్న సుబ్బయ్య యాదవ్



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘ వాలంటీర్ చావడి మురళి ఆహ్వానం మేరకు హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్న సుబ్బయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, గ్రామస్తులతో కలిసి జాతర వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామమంతా భక్తిశ్రద్ధలతో కళకళలాడగా, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుల సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలు, “ఇంద్రధనస్సు” కార్యక్రమం అమలు విధానం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను నాయకులు రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, పుల్లంపేట అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి, కోడూరు అధ్యక్షుడు ధనుంజయ్, పెనగలూరు అధ్యక్షుడు తిరుపాల్, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, పుల్లంపేట ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, జ్యోతిశ్వర్త నాయుడు, రెడ్డయ్య, వాలంటీర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జాతర ఆహ్వానం మేరకు విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్న సుబ్బయ్య యాదవ్‌ను జాతర నిర్వాహకులు చావిడి మురళి గంగమ్మ తల్లి కండువాతో ఘనంగా సన్మానించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగు దినపత్రిక


# సిటిఎం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాలు

## - చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు బీవైఎస్ వినతి



మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం, సి.టి.ఎం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాల సెల్లార్లను దుకాణాలుగా మార్చడం వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలపై గురువారం బహుజన యువ సేన నాయకులు పునీత్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ సి.టి.ఎం రోడ్డులోని దాదాపు అన్ని వాణిజ్య సముదాయాలలో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను అక్రమంగా దుకాణాలుగా మార్చి వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ జీవో నెంబర్ 119కు పూర్తిగా విరుద్ధమని, భవనాల్లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కస్టమర్లు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారని, దీనివల్ల అంబులెన్స్‌లు, విద్యార్థులు మరియు సాధారణ ప్రజలు గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతున్నాని ఆరోపించారు. గతంలో రోడ్డు విస్తరణ పేరుతో పెద్ద చెట్లను తొలగించి, ఆ ఖాళీ స్థలాలను వాహనాల పార్కింగ్‌కు కేటాయించడం వల్ల పాదచారులకు నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని వెంటనే సి.టి.ఎం రోడ్డులోని భవనాలను తనిఖీ చేసి, అక్రమ సెల్లార్ దుకాణాలను తొలగించి, వాటిని తిరిగి పార్కింగ్ కోసం ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన భవన యజమానులపై భారీ జరిమానాలు విధించాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా బాహుజన యువసేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

# బలిజపల్లి గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

## - వేకువ ఝాము నుంచే కిక్కిరిసిన భక్తులు

## - అమ్మవారిని దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు

రాజంపేట (ప్రజా సీమ): జిల్లాలోని [illegible] జాతర




గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ ఝాము నుంచే వేలాది మంది భక్తులు బలిజిపల్లెకు చేరుకొని అమ్మవారి దర్శనం చేసుకుని పొంగళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాజంపేట పట్టణంలో అడుగడుగునా అమ్మవారి భక్తులు మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలోనూ ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, మంచినీరు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజంపేట ఏఎస్పి మనోజ్ రాంనాథ్ హెగ్డే ఆధ్వర్యంలో రాజంపేట పట్టణ సి ఐ నాగార్జున, మన్నూరు సి ఐ లింగప్ప, ఎస్ ఐ లు, 120 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న రద్దీని నియంత్రిస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నియంత్రించారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా చిన్నపిల్లలు, వృద్ధులు సైతం అమ్మవారి దర్శనానికి ఎగబడ్డారు. సామాన్య ప్రజలతో పాటు రాజకీయ ప్రముఖులు జాతరలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

# గంగమ్మ తల్లి జాతరలో అన్నదానం



రాజంపేట (ప్రజా సీమ): గురువారం రాజంపేట శ్రీ గంగమ్మ తల్లి జాతర సందర్భంగా, జాతరలో, "అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ, రాజంపేట" వారి ఆధ్వర్యంలో ధర్మ ప్రచార సభ కడప రాజంపేట ప్రెసిడెంట్ నలమారు శ్రీనివాసులరెడ్డి, రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఉచిత అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించి వందలాది మంది భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ సభ్యులు ఎలక్ట్రీషియన్ శివ, తాళ్లపాక చంటి తదితర అయ్యప్ప భక్త బృందం పాల్గొనడం జరిగింది.

# బలిజపల్లి గంగమ్మ తల్లిని దర్శించుకున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి



రాజంపేట,(ప్రజాసీమ) : కడప జిల్లా రాజంపేట పట్టణంలోని ఎంతో వైభవపీతంగా అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ బలిజపల్లి గంగమ్మ తల్లి జాతర గురువారం పురస్కరించుకొని గుంతకల్ డివిజన్ రైల్వే వినియోగదారుల సభ్యులు, వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకుని అమ్మవారి ఆశీర్వచనాలు పొందడం జరిగింది. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనం చాలా కన్నులు విందుగా జరిగిందని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై మెండుగా ఉండాలని కోరుకుంటూ, అమ్మవారి దర్శన భాగ్యం నాకు కలగడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.

# నేను కాదు... మనం

## - క్షేత్ర స్థాయి ఉద్యోగుల అనుభవాన్ని వినియోగించుకోవాలి

## - సింగపూర్ ఉత్తమ విధానాలను ఓ జిల్లాలో అమలు చేద్దాం

## - టూరిజం అభివృద్ధి చేసిన జిల్లాకు అత్యధిక ఆదాయం

## - 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు








అమరావతి, (ప్రజా సీమ): మే 7 : టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి జరుగుతుందని... నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక నుంచి తాను కూడా నేను అనే పదాన్ని పక్కన పెట్టి మనం అనే పదాన్ని ఉపయోగిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చ జరిగింది. దీంట్లో భాగంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయి. సింగపూర్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేద్దాం. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేపట్టాలి. సింగపూర్ దేశంలో నేను కాదు.. మనం అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూడా నేను కాదు మనం అనే విధానాన్నే అవలంభిద్దాం. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా... సంక్షేమ, అభివృద్ధి జరగుతున్నా.. అందరి కృషి వల్లే సాధ్యమైంది. కలిసి కట్టుగా పని చేస్తే... ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటే ప్రభుత్వం మరింత విజయవంతంగా సేవలు అందించగలదు. నేను కాదు మనం అనే విధానాన్ని నాతో ప్రారంభిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఆలోచన చేయాలి. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయి. గిరిజన ప్రాంతంలో ఉంటూనే పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో అభివృద్ధి వేర్వేరుగా ఉంది. అల్లూరి జిల్లాలో కాఫీ పంటకు విలువ జోడింపుతో జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపై దృష్టి సారించాలి... ప్రగతి సాధనలో కీలకంగా వ్యవహరించాలి. సర్వీస్ సెక్టార్ మరింతగా పెరగాలి. దేశ జీడీపీలో ఏపీ 10 శాతం మేర వ్యవసాయ ఉత్పత్తుల వాటాను కలిగి ఉంది. కొన్ని జిల్లాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి.. వాటికి సంబంధించిన ప్లాంట్లు వస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంది. జీఎస్డీపీ గ్రోత్ విషయంలో కలెక్టర్లు ఎలా పని చేస్తున్నారనే అంశంపై అధ్యయనం చేస్న?న్నాం. నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై జిల్లా కలెక్టర్లు ఆలోచనలు చేయండి. అన్నమయ్య జిల్లా కలెక్టరే దీనికి ఉదాహరణ. బెస్ట్ పాలసీల అమల్లో కలెక్టర్లు పోటీలు పడాలి. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు పోటీ పెట్టినట్టే... జిల్లా స్థాయిలో నియోజకవర్గాల మధ్య పోటీ పెట్టండి. ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లకు చాలా అనుభవం ఉంటుంది.. వాళ్ల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. క్షేత్ర స్థాయి అధికారులను సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది.. సంక్షేమం చక్కగా అందుతుంది... వినూత్నమైన ఆలోచనలను అమలు చేసేందుకు అవకాశం దక్కుతుంది. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు తదితర ప్రాంతాల్లో బీచ్ ఫ్రంట్లు అభివృద్ధి చేస్తే స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త జాతీయ రహదారులు కొత్త అవకాశాల్ని సృష్టిస్తాయి... లాజిస్టిక్స్ హబ్ లను ఏర్పాటు చేసుకోవచ్చు... టౌన్ షిప్ లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. విజన్ యూనిట్లను జిల్లా కలెక్టర్లు సమర్థంగా వినియోగించుకోవాలి. గతంలో పెద్ద జిల్లాల్లో 21 నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి వచ్చేది. కలెక్టర్లు జిల్లా పర్యటనకు వెళ్తే ప్రయాణానికే ఓ పూట పట్టేది. ఇప్పుడు ప్రతీ జిల్లా కలెక్టర్ పరిధిలో కేవలం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. గతానికంటే మెరుగైన పనితీరు కనబర్చడానికి... అభివృద్ధి చేయడానికి, సంక్షేమం అందించడానికి ఇప్పుడు కలెక్టర్లకు అవకాశాలు ఎక్కువ."అని సీఎం వివరించారు.

# జలధారతో చెరువులకు నూతన జీవం

## - ఫీడర్ ఛానళ్ల పునరుద్ధరణతో బహుళ ప్రయోజనాలు

## - సాగునీటితో పాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదం

## - ప్రభుత్వ జల సంరక్షణ కార్యక్రమాలపై సర్వత్రా హర్షం





ఎన్‌టీఆర్ జిల్లా, (ప్రజా సీమ) మే 7 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార--జలహారతి కార్యక్రమం కింద ఎన్‌టీఆర్ జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జి.కొండూరు మండలంలోని చెరువుమాధవరం గ్రామ పరిధిలో ఉన్న గ్రంథివాని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పూర్తయితే వర్షాకాలంలో వచ్చే నీరు సక్రమంగా చెరువుకు చేరే అవకాశం కలుగుతుంది. దీంతో గ్రంథివాని చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, గ్రామంలోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. చెరువు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. అదేవిధంగా రైతులు వరి, మిర్చి, కూరగాయలు తదితర పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం పొందడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశముంది. అదేవిధంగా గ్రామ పరిసరాల్లో పచ్చదనం పెరగడం, పశువులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడడం, నీటి కొరత సమస్య తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు గ్రామ ప్రజలకు చేకూరనున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత చెరువుమాధవరం గ్రామం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఆరోగ్యం



## మీ నాలుకపై ఇలా కనిపిస్తున్నాయా?

## బీ కేర్ ఫుల్..క్యాన్సర్ సంకేతమే!

మనకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి డాక్టర్ దగ్గరకి వెళ్లాక ఫస్ట్ నాలుక చూపించండి అని డాక్టర్ అడగటం మనకు తెలిసిందే. అయితే వేర్వేరు సమస్యలు ఉన్నాయని మీరు డాక్టర్ దగ్గరకి వెళ్లే నాలుక చూపించమంటారేంటబ్బా అని ఎప్పుడైనా ఆలోచించారా? వాస్తవానికి మీ నాలుక మీ ఆరోగ్యానికి అద్దం లాంటిది. నాలుక రంగు, ఆకారం,ఉపరితలంపై కనిపించే మార్పులు కొన్నిసార్లు మీ శరరం లోపల ఏదో తీవ్రమైన వ్యాధి గురించి హెచ్చరించే సంకేతాలు కావచ్చు. డాక్టర్లు తరచుగా మీ నోరు తెరిచి నాలుకను పరిశీలించడం వెనుక దాగిన కారణం ఇదే. మీ నాలుకలో కనిపించే కొన్ని మార్పులు,అవి ఏ ప్రమాదకర వ్యాధులను సూచిస్తాయో ఇప్పుడు చూద్దాం.

నల్లగా,చిన్న వెంటుక్రల్లా కనబడితే కొన్నిసార్లు మన నాలుక మీద నల్లగా,చిన్న చిన్న వెంటుకల్లా కనిపిస్తే కొందరు కంగారు పడిపోతారు. వాస్తవానికి దీనికి కారణం ఏంటంటే మన నాలుక మీద చిన్న చిన్న మొగ్గల్లాంటి నిర్మాణాలుంటాయి. వీటినే పాపిల్లే అంటారు. కొన్ని సమయాల్లో ఈ పాపిల్లేలు ఎక్కువగా పెరిగిపోతాయి. అప్పుడు వాటి మధ్యలో బ్యాక్టీరియా, ఈస్ట్ వంటి సూక్ష్మజీవులు పేరుకుపోతుంటాయి. ఇవే ఆ నలుపు రంగు,వెంట్రుకల వంటి రూపాన్ని కలిగిస్తాయి. దీనికి చాలా కారణాలుంటాయి. అయితే ప్రధానంగా నోటి పరిశుభ్రత సరిగ్గా లేకోవడం వల్లనే ఇలా అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా స్మోకింగ్ చేసేవారిలో, ఎక్కువ కాలం యాంటీబయాటిక్స్ వాడిన వారిలో లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో కూడా ఇది కనిపించవచ్చు. దీని గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని..ఇది సాధారణంగా ప్రమాదకరమైన పరిస్థితి కాదని.. కానీ ఇలా ఉంటే మాత్రం మీ నోటిని మరింత శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఒకసారి డెంటిస్ట్ ని సంప్రదించడం బెటర్. అంతేకాకుండా స్మోకింగ్ చేసేవారిలో, ఎక్కువ కాలం యాంటీబయాటిక్స్ వాడిన వారిలో లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో కూడా ఇది కనిపించవచ్చు. దీని గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని..ఇది సాధారణంగా ప్రమాదకరమైన పరిస్థితి కాదని.. కానీ ఇలా ఉంటే మాత్రం మీ నోటిని మరింత శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఒకసారి డెంటిస్ట్ ని సంప్రదించడం బెటర్. ఎర్రగా,ఉబ్బెత్తుగా మచ్చ కనిపిస్తే నాలుక మీద చాలా కాలంగా ఒక ఎర్రటి, నునుపైన లేదా కొద్దిగా ఉబ్బెత్తుగా ఉన్న మచ్చ కనిపిస్తే కొంచెం జాగ్రత్తగా ఉండాలి. దీనిని వైద్య పరిభాషలో 'ఎరిత్రోప్లాకియా' అంటారు. ఇది అంత ప్రమాదకరమైనది కాకపోయినా.. కొన్నిసార్లు ఇది క్యాన్సర్ ప్రారంభ లక్షణం అవొచ్చు. కాబట్టి దీన్ని తేలికగా తీసుకోకూడదు. వెంటనే డాక్టర్‌ను కలవడం చాలా ముఖ్యం. సకాలంలో సరైన ట్రీట్మెంట్ తీసుకుంటే భవిష్యత్తులో వచ్చే పెద్ద ప్రమాదాలను తప్పించుకోవచ్చు.

నునుపుగా,మెరిసేలా కనబడుతుంటే నాలుక మీద నునుపుగా,మెరిసేలా అనిపించవచ్చు. నాలుపై ఉండే చిన్న గరుకుదనం తగ్గిపోయి ఒక విధమైన మెరుపు వస్తుంది. మీ శరీరంలో ఐరన్, ఫోలేట్, విటమిన్ %దీ%12 వంటి ముఖ్యమైన పోషకాల కొరత ఉండొచ్చు. మెడికల్ బాషలో ఈ పరిస్థితిని 'అట్రోఫిక్ గ్లోసిటిస్' అంటారు. ఇలా మారిన నాలుక ఎర్రగా, కొద్దిగా బాధాకరంగా కూడా ఉండొచ్చు. అంతేకాకుండా ఇది మీ శరీరంలో అలసట, నాడీ సంబంధిత సమస్యలు లేదా రక్తహీనత వంటి ఇతర ఇబ్బందులు కూడా ఉన్నాయని తెలియజేస్తుంది. కాబట్టి వెంటనే ఇలా కనిపిస్తే డాక్టర్ ని సంప్రదించాలి.

## అమృతాన్ని తలపించే దూద్ దులారి..ఈజీగా ఇలా చేసుకోండి



కడుపులో చాలా చల్లగా,మృదువుగా,చూస్తేనే నోరూరిపోయేలా ఉండే దూద్ దులారి ఎప్పుడైనా తిన్నారా? ఇది పాలతో తయారుచేసే ఒక తీపి వంటకం. బాదం, పిస్తా, కిస్ మిస్ డ్రై ఫ్రూట్స్,పండ్లు దీనికి ప్రత్యేకమైన రుచిని,ఆకర్షణీయతను తీసుకొస్తాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమృతంలా ఉంటుంది. సాధారణంగా ఈ డెజర్ట్ ని నార్త్ ఇండియాలో ఎక్కువగా పండుగలు,ప్రత్యేక సందర్భాల్లో తయారుచేస్తుంటారు. అయితే దూద్ దులారిని మీ ఇంట్లో సులభంగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

దూద్ దులారి తయారీకి కావాల్సిన పదార్థాలు -సేమియా -పాలు -ఆయిల్ -ఫ్రెష్ క్రీమ్ -మొక్కజొన్న పిండి -రోజ్ వాటర్ -వెన్నీలా ఎసెన్స్ -బాదం -పిస్తా

-కిస్ మిస్ -ఫ్రూట్ కాక్ టెయిల్ లేదా తాజా పండ్లు

దూద్ దులారి తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద ఓ పెద్ద గిన్నె పెట్టి అందులో ఓ లీటరు బర్రెపాలు పోసి కలుపుతూ మరిగించుకోవాలి. -పాలు రెండు పొంగులు రాగానే అందులో అరకప్పు సేమియా వేసి సేమియాని మెత్తగా ఉడకనివ్వాలి. -సేమియా ఉడికిన తర్వాత అందులో ముప్పావు కప్పు నెస్లే మిల్క్ మెయిడ్( %చీవర్శ్రీవ వీఅశ్రీనిఖుఱం%)వేశాక మళ్లీ రెండు పొంగులు వచ్చాక అందులో 1 టీస్పూన్ రోజ్ వాటర్, 1 టీస్పూన్ వెన్నీలా ఎసెన్స్ వేసి బాగా కలపండి. -తర్వాత ఒక చిన్న బౌల్ లో 1 టేబుల్ స్పూన్ మొక్కజొన్న పిండి , పావు కప్పు వేడి పాలు పోసి ఉండలు లేకుండా కలిపాక దీనిని స్టవ్ మీద ఉన్న పాలలో పోస్తూ కలుపుకోవాలి.

-4 నిమిషాలకు పాలు చిక్కబడిన తర్వాత అందులో అర కప్పు ఫ్రెష్ క్రీమ్ వేసి బాగా కలపాలి. చిలికిన చిక్కటి పెరుగు మాదిరి ఉండాలి.

-తర్వాత ప్రెజర్ కుక్కర్ ని స్టవ్ మీద నుంచి దించేసి ఓ బౌల్ లో పోసి ఫ్రిడ్జ్ లో కనీసం 2 గంటలు చల్లారనివ్వండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 250%ఎత్రీ% నీళ్లు పోసి మరిగించాలి. సగం మరిగాక ఇందులో మీకు నచ్చిన ఫ్లేవర్ మార్కెట్ లో దొరికే రెడీమేడ్ జెల్లీ మిక్స్.. అర ప్యాకెట్ వేసి కలపాలి. -జెల్లీ మిక్స్ కరిగిన తర్వాత దాన్ని ఓ ప్లేట్ లోకి తీసుకొని 2 గంటలు పక్కనపెట్టుకోవాలి. తర్వాత దీన్ని మీకు నచ్చిన షేపులో కట్ చేసుకొని పక్కన ఉంచుకోండి. -ఇప్పుడు ఓ చిన్న జల్లెడలో రెడీమేడ్ గా దొరికే 1 కప్పు ఫ్రూట్ కాక్ టెయిల్ లేదా తాజా పండ్ల ముక్కలు(ద్రాక్ష, అరటి, యాపిల్,దానిమ్మ గింజలు) వేసి నీరు దిగాక దీన్ని ఫ్రిడ్జ్ లో ఉంచి దూద్ దులారీ మిశ్రమంలో వేసి కలపాలి. -తర్వాత అందులో కట్ చేసిన బాదం,పిస్తా పలుకులు వేసి కలపండి. తర్వాత ఇందులో జెల్లీలు, అంగూరీ రసగుల్లాలు 15 వేసి బాగా కలపాలి. అంతే దూద్ దులారీ రెడీ. సర్వ్ చేసే ముందు ఇందులో కొద్దిగా కుంకుమ పువ్వు నానబెట్టిన పాలను దానిమీద చల్లితే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

## వాసనకే కడుపు నిండిపోయే కరివేపాకు పులావ్..ఇలా చేసుకుంటే సూపర్ టేస్ట్



పులావ్ పేరు వింటే నే కొందరికి నోట్లో నీళ్లూరుతుంటాయి. ఇక వాసన వస్తే ప్లేటు పట్టుకొని పరిగెత్తా ల్సిందే. అయితే మీరెప్పుడైనా కరివేపాకు పులావ్ తిన్నారా? ఉల్లిపాయ. వెల్లుల్లి లేకుండానే తయారుచేసే కరివేపాకు పులావ్.. సౌతిండియాలో చాలా ఫేమస్,టేస్టీ వంటకం. తక్కువ సమయంలో తయారయ్యే ఈ పులావ్ లో కరివేపాకు ప్రత్యేకమైన సువాసన,రుచి ఉంటాయి. ఇది అందరికీ నచ్చుతుంది. కరివేపాకు పులావ్ ని మీ ఇంట్లోనే సులభంగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

కరివేపాకు పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు -శెనగపప్పు -మినపప్పు -ఆయిల్ -ఆవాలు -ఎండుమిర్చి -మిరియాలు -జీడిపప్పు -ఇంగువ -బాస్మతి రైస్.

-నీళ్లు -జీలకర్ర -కరివేపాకు -గరం మసాలా.

కరివేపాకు పులావ్ తయారీ విధానం -ముందుగా ఒకటిన్నర కప్పు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా రెండుసార్లు కడిగి కనీసం 20 నిమిషాలు నానబెట్టుకోవాలి.

-ఇప్పుడు పులావ్ చేసే గిన్నెను లేదా ప్రెజర్ కుక్కర్ ని స్టవ్ మీద పెట్టి అందులో కొద్దిగా ఆయిల్ వేసి వేడయ్యాక ఇందులో ఒకటిన్నర టేబుల్ స్పూన్ పచ్చి శెనగపప్పు, ఒకటిన్నర టేబుల్ స్పూన్ మినపప్పు వేసి అవి బంగారు గోధుమ రంగులోకి వచ్చేదాకా వేయించాలి. -తర్వాత అందులో 1 టీస్పూన్ ఆవాలు, 4 ఎండుమిర్చి, కొద్దిగా మిరియాలు, 1 టీస్పూన్ జీలకర్ర,చిటికెడు ఇంగువ వేసి వేయించాక ఇందులో 1 కప్పు కరివేపాకు, 15 జీడిపప్పు వేసి 1 నిమిషం పాటు వేయించుకోవాలి. జీడిపప్పు బంగారు రంగులోకి మారేదాకా వేయించాలి. కరివేపాకును నూనెలో వేయించడం వల్ల దాని సువాసన పులావ్ కి పట్టుకుంటుంది. -తర్వాత ఇందులో శుభ్రంగా కడిగిన ఒకటిన్నర కప్పు బాస్మతి బియ్యం,కొద్దిగా గరం మసాలా,రుచికి సరిపడా ఉప్పు,3 కప్పుల నీళ్లు పోసి బాగా కలిపి మంటను మీడియంలో పెట్టి 2 విజిల్స్ వచ్చేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత మూతీసి అందులో కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం,కొత్తిమీర తరుగు వేసి కలుపుకోవాలి. అంతే కరివేపాకు పులావ్ రెడీ. దీనిని పెరుగు,రైతా లేదా మీకు నచ్చిన కూరతో కలిపి తింటుంటే ఆ మజానే వేరే లెవల్ లో ఉంటుంది.

## గుజరాత్ స్పెషల్ 'ఖఖ్రా' ఎప్పుడైనా తిన్నారా?

## భలే ఉంటదబ్బా..ఎలా చేసుకోవాలంటే..



మనదేశంలోని గుజరాత్ పరిశ్రమలకే కాదండోయ్ వంటకాలకు కూడా ప్రసిద్ధే. కొన్ని గుజరాతీ వంటకాలు వరల్డ్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాయి. అలాంటి వాటిల్లో ఖాఖ్రా ఒకటి. దీనిని రోటీ,చపాతీ మాదిరి తయారుచేస్తారు..కానీ చాలా పల్చగా కాల్చి,క్రిస్పీగా చేస్తారు. ఖఖ్రా చాలా సులభంగా జీర్ణమయ్యే ఆహారం కూడా. దీనిని బ్రేక్ ఫాస్ట్ లోకి లేదా ప్రయాణాల్లో తినడానికి అనువుగా ఉంటుంది. గుజరాతీ స్టైల్ లో ఖఖ్రాని మీ ఇంట్లోనే తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

ఖఖ్రా తయారీకి కావలసిన పదార్థాలు ధనియాల పొడి - 1 టీస్పూన్ జీలకర్ర పొడి - 1/2 టీస్పూన్ నువ్వులు - 1 టేబుల్ స్పూన్ గోధుమ పిండి - 2 కప్పులు శెనగ పిండి (బేసన్) - 1/4 కప్పు నూనె - తగినంత ఉప్పు - రుచికి తగినంత నీరు - పిండి కలపడానికి తగినంత పసుపు పొడి - 1/4 టీస్పూన్ కారం పొడి - రుచికి తగినంత వాము - 1/2 టీస్పూన్ కసూరి మేథీ- 1 టేబుల్ స్పూన్ నలిపినది.

ఖఖ్రా తయారీ విధానం -ఖఖ్రా తయారీకోసం ముందుగా ఒక పెద్ద గిన్నెలో గోధుమ పిండి, శెనగ పిండి వేయండి. ఇందులో కొద్దిగా నూనె, పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, నువ్వులు, వాము, కసూరి మేథీ,ఉప్పు వేసి అన్నీ బాగా కలిసేలా చేతితో కలపాలి. -కొద్ది కొద్దిగా నీరు పోస్తూ మెత్తని పిండి ముద్దలా కలపండి. పిండి మరీ మెత్తగా లేదా గట్టిగా ఉండకూడదు. చపాతీ పిండిలా ఉండాలి.

-పిండిని తడి గుడ్డతో కప్పి 15-20 నిమిషాలు నాననివ్వండి. -నానిన పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోండి. నిమ్మకాయ పరిమాణంలో ఉండలు చేస్తే సరిపోతుంది. -ఒక ఉండను తీసుకొని పొడి పిండిలో అద్ది చపాతీ కర్రతో వీలైనంత పలుచగా రోటీలా ఒత్తండి. ఖఖ్రా ఎంత పలుచగా ఉంటే అంత క్రిస్పీగా వస్తుంది.-తర్వాత స్టవ్ మీద పెనం వేడి చేసి ఒత్తిన ఖాఖ్రాను వేడి పెనం మీద వేయండి. ఒక వైపు కొద్దిగా కాలిన తర్వాత దానిని తిప్పి రెండో వైపు కూడా కొద్దిగా కాల్చండి. -ఇప్పుడు ఒక గుడ్డ లేదా కాటన్ క్లాత్ తీసుకొని ఖఖ్రాను నెమ్మదిగా నొక్కండి. ఇలా చేయడం వల్ల ఖఖ్రా సమానంగా కాలుతుంది, క్రిస్పీగా మారుతుంది. -రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకు, క్రిస్పీగా మారే వరకు కాల్చి దించేయాలి. అంతే గుజరాత్ స్పెషల్ ఖఖ్రా రెడీ. దీనిని మీకు నచ్చిన పచ్చడి, పెరుగు, వెన్నతో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది.

# సినిమా న్యూస్



## తగ్గిన సమంత 'బంగారం' .. ఒరిజినల్ రీజన్ ఇదేనా?



స్టార్ హీరోయిన్ సమంత లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ మా ఇంటి బంగారంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత సమంత పూర్తి స్థాయి పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్న ఆ సినిమాపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఆ చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి హైప్ తీసుకొచ్చింది. సాధారణ గృహిణిలా కనిపించే మహిళ.. అవసరమైతే ఎంతటి పరిస్థితినైనా ఎదుర్కొనే పవర్ ఫుల్ లేడీగా మారే పాత్రలో సమంత కనిపించనుందనే టీజర్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో సమంత లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, ఉమెన్ ఓరియంటెడ్ స్టోరీతో చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

అయితే ఆ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు రీసెంట్ గా మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. నిజానికి ఆ చిత్రాన్ని మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ ఇప్పుడు రిలీజ్ డేట్ ను జూన్ 19కు మార్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అదే సమయంలో వాయిదా వేయడానికి ఐపీఎల్ కారణమని మూవీ టీమ్ చెబుతోంది. ఐపీఎల్ సీజన్ సమయంలో థియేటర్లకు ప్రేక్షకుల రాక తగ్గే అవకాశం ఉండటంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద సినిమాలు, కుటుంబ ప్రేక్షకులను టార్గెట్ గా పెట్టుకున్న చిత్రాలపై ఐపీఎల్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుందని అంతా భావిస్తుంటారు. అయితే ఇప్పుడు నెట్టింట మరో టాక్ వినిపిస్తోంది. ఐపీఎల్ కారణం కేవలం ఒక ఎక్స్క్యూజ్ మాత్రమేనని ప్రచారం జరుగుతోంది. అసలు సమస్య థియేటర్లు దొరకకపోవడమేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారీ సినిమాల పోటీ, థియేటర్ల కేటాయింపు సమస్యల కారణంగా మా ఇంటి బంగారం మూవీకి సరైన రిలీజ్ ప్లానింగ్ కుదరలేదని అంటున్నారు. ముఖ్యంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా థియేటర్లపై భారీ ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో.. ఆ సినిమా రన్ పూర్తయ్యాక సమంత సినిమా విడుదల చేయాలని నిర్మాతలు భావించినట్లు టాక్ నడుస్తోంది. మంచి రిలీజ్ టైమ్ దొరికితేనే సినిమాకు కలెక్షన్లు స్ట్రాంగ్ గా వచ్చే అవకాశం ఉందని మేకర్స్ లెక్కలు వేసుకుంటున్నారట. ఇక సమంత అభిమానులు మాత్రం సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత కొంతకాలంగా లేడీ ఓరియెంటెడ్ కథలపై ఎక్కువగా దృష్టి పెడుతున్న సమంత.. మా ఇంటి బంగారం చిత్రంతో మరోసారి తన యాక్టింగ్ లోని మరో యాంగిల్ ను చూపించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. విడుదల లేట్ అయినా సరే.. మంచి కంటెంట్ తో వస్తే సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.


## 'పెద్ది' ప్రీ రిలీజ్.. హైప్ డబుల్ అయ్యేలా ప్లాన్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, పోస్టర్స్, టీజర్ ప్రేక్షకుల్లో మంచి హైప్ క్రియేట్ చేయగా.. ఇప్పుడు సినిమా ప్రమోషన్స్ ను కూడా అదే రేంజ్ లో గ్రాండ్ గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ప్రీరిలీజ్ ఈవెంట్ ను భారీ స్థాయిలో నిర్వహించి సినిమాపై ఉన్న హైప్ ను డబుల్ చేసేలా మేకర్స్ భావిస్తున్నారని తెలుస్తోంది. వరల్డ్ వైడ్ గా సినిమా జూన్ 4న రిలీజ్ కానుండగా.. జూన్ 2న హైదరాబాద్ లో పెద్ది ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ అభిమానుల్లో మాత్రం ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ ఫ్యాన్స్ ఆ ఈవెంట్ పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున డిస్కస్ చేసుకుంటున్నారు. డేట్, వెన్యూ దాదాపు ఫిక్స్ అయ్యాయంటూ పోస్టులు వైరల్ చేస్తున్నారు. ఇక సినిమా గ్రామీణ క్రీడల నేపథ్యంలో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా కావడంతో.. అదే థీమ్ ను రిఫ్లెక్ట్ చేసేలా ప్రీరిలీజ్ ఈవెంట్ ను డిజైన్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. స్టేజ్ డిజైన్ నుంచి ఎంట్రీల వరకు ప్రతిదీ విలేజ్ స్పోర్ట్స్ కాన్సెప్ట్ కు తగ్గట్టుగా ఉండేలా ప్రత్యేకంగా రెడీ చేస్తున్నారని సమాచారం. అభిమానులకు కొత్త ఎక్స్పీరియన్స్ కలిగించేలా ఆ వేడుకను విజువల్ ఫీస్ట్ గా మార్చేందుకు టీమ్ ఏర్పాట్లు చేస్తోందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఆ భారీ ఈవెంట్ కు వేదికగా హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియాన్ని సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నో సినిమా ఈవెంట్లు, పొలిటికల్ మీటింగ్స్ సక్సెస్ ఫుల్ గా నిర్వహించిన ఆ స్టేడియంలో భారీ సంఖ్యలో అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటంతో.. పెద్ది టీమ్ కూడా ఇదే వేదికను ఫైనల్ చేసినట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా రామ్ చరణ్ అభిమానులు వేలాదిగా వచ్చే అవకాశం ఉండటంతో పెద్ద వేదిక అవసరమని భావించినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు.. ఆ ప్రీరిలీజ్ ఈవెంట్ కు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా హాజరయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

మేకర్స్ ఆ వేడుకను కేవలం సినిమా ప్రమోషన్ ఈవెంట్ గా కాకుండా.. అభిమానులకు ఓ మెగా సెలబ్రేషన్ లా మార్చాలని భావిస్తున్నారట. ఆ ఈవెంట్ ద్వారా సినిమాపై మరింత హైప్ తీసుకురావడమే టార్గెట్ గా పెట్టుకున్నారని సమాచారం. ఇప్పటికే పెద్ది నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి స్పందన రావడంతో.. సినిమా విడుదలపై కూడా ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. విలేజ్ బ్యాక్ డ్రాప్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్, రామ్ చరణ్ మాస్ లుక్.. అన్నీ కలిసి సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ మూవీ టీమ్ ప్రమోషన్స్ ను మరింత స్పీడప్ చేస్తుండగా.. ఇప్పుడు అందరి దృష్టి ప్రీ రిలీజ్ ఈవెంట్ అధికారిక ప్రకటన పైనే నిలిచింది.



## 100 కోట్ల క్లబ్ హీరోయిన్ సడెన్‌గా అదృశ్యం వెనక కారణం?



టాలీవుడ్‌లో -గజిని- సినిమాతో 100 కోట్ల క్లబ్ నాయికగా సత్తా చాటింది అసిన్. అలాగే రవితేజ -అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి- చిత్రంతో తెలుగువారి గుండెల్లో నిలిచింది. గజిని బ్లాక్ బస్టర్ కొట్టాక అశిన్ కెరీర్ వెనుదిరిగి చూసుకున్నదే లేదు. ఇటు తమిళం- తెలుగు, అటు హిందీ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు తెచ్చుకుంది. పలు బ్లాక్ బస్టర్ చిత్రాలతో సౌత్ నుంచి నార్త్ వరకు టాప్ హీరోయిన్ గా అశిన్ ఎదిగారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే తన ప్రేమ కోసం.. కుటుంబం కోసం.. గ్లామర్ ప్రపంచానికి స్వస్తి చెప్పి ఏకంగా తన సినీ కెరీర్‌నే త్యాగం చేయడం అప్పట్లో ఒక సంచలనం. ప్రస్తుతం తన భర్త, పిల్లలతో కలిసి గ్లామ్ అండ్ గ్లిజ్ ప్రపంచానికి దూరంగా ఒక నిరాడంబరమైన.. అత్యంత సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. అసిన్ తన నిజజీవిత భాగస్వామిగా -మైక్రోమ్యాక్స్- అధినేత రాహుల్ శర్మను ఎంచుకోవడం వెనుక ఒక సినిమాటిక్ ఘటన దాగి ఉంది. -గజిని- చిత్రంలో ఒక సెల్ ఫోన్ కంపెనీ యజమానితో ప్రేమాయణం నడిపించినట్లే నిజ జీవితంలోనూ ఒక అగ్రశ్రేణి సెల్ ఫోన్ కంపెనీ అధినేతతోనే ప్రేమలో పడటం విశేషం. వీరిద్దరి కలయికకు బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్ వారధిగా నిలిచారు. -ఖిలాడీ 786- షూటింగ్ సమయంలో అక్షయ్ వీరిని ఒకరికొకరికి పరిచయం చేయగా అది కాస్తా ప్రేమగా మారింది. ఈ జంట 2016 జనవరిలో హిందూ- క్రిస్టియన్ పద్ధతుల్లో ఘనంగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. దశాబ్ద కాలంగా ఈ బంధం మరింత దృఢంగా సాగుతోంది. దాదాపు 1400 కోట్ల నికర ఆస్తులున్న ఒక భారీ వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి అయి ఉండి కూడా, తన భార్యను కేవలం జీవన సహచరిగానే కాకుండా.. తన జీవితానికి .. కుటుంబానికి ఒక -కో-ఫౌండర్- (సహ వ్యవస్థాపకురాలు) ఆయన పదవినిచ్చి గౌరవించారు. గడిచిన పదేళ్లు ఒక అందమైన ప్రయాణంలా సాగాయి.. ఆమె నా జీవితంలో ఒక అద్భుతమైన శక్తి! అంటూ రాహుల్ ఆనందం వ్యక్తం చేస్తుంటారు. వివాహానంతరం సినిమాలకు పూర్తిగా స్వస్తి చెప్పిన అసిన్ తన కుమార్తె అరిన్ భవిష్యత్తుపై పూర్తి దృష్టి సారించారు. అరిన్ కూడా తల్లి లాగే డ్యాన్స్ - స్పోర్ట్స్ వంటి విషయాల్లో ఎంతో చురుగ్గా ఉన్నట్లు అసిన్ అప్పుడప్పుడు షేర్ చేసే ఫోటోల ద్వారా తెలుస్తోంది. పారిశ్రామికవేత్తగా రాహుల్ శర్మ మైక్రోమ్యాక్స్ ఇన్ఫర్మాటిక్స్‌తో పాటు, రివోల్ట్ ఎలక్ట్రిక్ బైక్స్ వంటి రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. 2025-26 నాటి అంచనాల ప్రకారం.. ఆయన ఆస్తి విలువ సుమారు 1400 కోట్ల వరకూ ఉంటుంది. ఇంతటి సంపన్నుడు తనకు భర్త అయినా.. అసిన్ తన జీవితాన్ని ఎంతో సింపుల్ గా మలుచుకోవడం ఆసక్తికరం. సాధారణంగా స్టార్ హీరోయిన్లు తమ కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు సినిమాలను వదిలేయడానికి ఇష్టపడరు. కానీ అసిన్ మాత్రం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని.. ఎప్పుడు ఏం చేయాలో తెలిసిన వ్యక్తిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఒక స్టార్‌గా ఎంతటి గుర్తింపు పొందారో.. ఇప్పుడు ఒక గృహిణిగా, తల్లిగా అంతకంటే ఎక్కువ సంతృప్తిని పొందుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

## బాలీవుడ్ లో ఆ సినిమా సీక్రెట్ చెప్పేసిన సాయిపల్లవి!



-ఏక్ దిన్- చిత్రంతో సాయి పల్లవి బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన నటించింది. ఇటీవలే రిలీజ్ అయిన సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది. సాయి పల్లవి పాత్రకు మాత్రం గుర్తింపు దక్కింది. నటన పరంగా అమ్మడు పాసై పోయింది. అయితే ఈ సినిమాతోనే సాయి పల్లవి బాలీవుడ్ లో లాంచ్ అవ్వడానికి గల కారణాలు ఏంటి? అనే కొంత డిస్కషన్ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా సాయిపల్లవి అందుకు గల కారణాన్ని రివీల్ చేసింది. -ఏక్ దిన్- కథ విన్న వెంటనే ఆమెకు హాలీవుడ్ క్లాసిక్ చిత్రం -బిఫోర్ సన్‌రైజ్- గుర్తొచ్చింది.

ఒకే రోజులో సాగే కథ ఇది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణలు, వారి భావోద్వేగాల చుట్టూ తిరిగే ఆ హాలీవుడ్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. -ఏక్ దిన్- స్క్రిప్ట్‌లో కూడా అదే తరహా స్వచ్ఛత, గాఢత ఉండటంతో సాయి పల్లవి మరో ఆలోచన లేకుండా ప్రాజెక్టును ఓకే చేసినట్లు తెలిపింది. సాధారణంగా బాలీవుడ్ అరంగేట్రం అంటే? హీరోయిన్లు భారీ కమర్షియల్ హంగులు, గ్లామర్ ఉన్న సినిమాలను ఎంచుకుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రనే ఎంచుకుంది. -నేను ఎప్పుడూ కథలోని లోతును, నా పాత్ర ఇచ్చే సంతృప్తిని మాత్రమే చూస్తాను. బిఫోర్ సన్‌రైజ్ లాంటి క్లాసిక్ వైబ్‌ని ఈ కథలో చూసినప్పుడు ఒక నటిగా నాలోని ఆసక్తిని అది రేకెత్తించింది- అని వెల్లడించింది. ఈ నిర్ణయంతో ఆమెలోని కళాత్మక దృక్పథాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సినిమాలో సాయి పల్లవి సాధారణ అమ్మాయిగా,ఎంతో సహజంగా కనిపిస్తుంది. కేవలం మాటలు,చూపులతోనే హావభావాలను పలికించాల్సిన పాత్ర ఇది.సాయి పల్లవి నటనలోని సహజ త్వం పాత్రకు మరింత ప్రాణం పోసిందని, జునైద్ ఖాన్‌తో ఆమె కెమిస్ట్రీ కూడా ఎంతోహుందాగా ఒదనివిమర్శకులుప్రశంసిస్తున్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma